క్లుప్తంగా

రామ, బలరామ అవతారంలో జగన్నాథుడు



పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



జియ్యమ్మవలస: పరశురాముని అవతారంలో జగన్నాథస్వామి

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం రామ, బలరామ అవతారంలో జగన్నాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశ్వనాథం దాస్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆదివారం మారురథయాత్ర ఉంటుందన్నారు. సోమవారం నుంచి ప్రధాన ఆలయంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

పరశురాముని అవతారంలో..

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు పరశురాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి గిరిధర్ పాత్రో ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి దర్శనానికి శనివారం భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పుట్టుదేవుని వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గోతుల పూడ్చివేత



ఏబీ రోడ్డుపై పడిన గోతులను పూడ్చుతున్న దృశ్యం

భామిని: మండలంలోని గురండి కూడలి వద్ద ఏబీరోడ్డుపై పడిన గోతులతో వాహనదారులు పడుతున్న ప్రయాణ కష్టాలకు తెరపడింది. స్థానిక యువకుల సహకారంతో ఎస్సై చేరూరి ప్రసాద్ సీసీ మిక్సర్ తెప్పించి గోతులను పూడ్చారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్, బత్తిలి యూత్ లీడర్ రాగోలు అశోక్ ఆయనకు సహకరించారు. రోడ్డుపై పడిన గోతులను తాత్కాలికంగా పూడ్చివేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం



భామిని: పొలాల్లో చేరిన వర్షం నీరు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, రావుపల్లి, ఉల్లిభద్ర, గొట్టివలస తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓమోస్తారు వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వర్షాలు లేక ఎండిపోతున్న వరి నారుమడులకు, వెద పొలాలకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులకు పదును అనుకూలంగా ఉండటంతో రైతులు పొలాలను చదును చేసి వరినాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

- **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం వరకు వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకు పరిమితమయ్యారు.
- **భామిని:** మండలంలో శనివారం ఉదయం నుంచి పలు దఫాలుగా చిరుజల్లులు కురిశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర అయినా ఇప్పటి వరకు సరైన వర్షాలు లేవు. ప్రస్తుతం ముసురు పట్టి వానలు పడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- **పాలకొండ రూరల్:** గత కొద్ది రోజులుగా వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊరట లభించింది. వరి వెదలు పిలకదశలో ఉన్న ఈ సమయంలో వర్షాలు కురవడంతో నీటి తడుల సమస్య తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తోటపల్లి నీరు విడుదల

- శివారు భూములకు సాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే జగదీశ్వరి
- కాలువల దుస్థితిపై డీఈఈని ప్రశ్నించిన రైతులు

గరుగుబిల్లి:

ఈ ఏడాది ఖరీఫ్‌కు తోటపల్లి ప్రాజెక్టు పాత ఆయకట్టుకు సంబంధించి శివారు భూములకు నిరాటంకంగా సాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసకుంటామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం ఉదయం తోటపల్లి ప్రాజెక్టు ఎడమ, కుడికాలువ గేట్లను పైకెత్తి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలువల ద్వారా సరఫరా అయ్యే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరారు. కాలువలు బలహీనంగా ఉన్నచోట తక్షణం మరమ్మత్తులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. కాలువ పరిధిలో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలో 30,602 ఎకరాలకు, కుడికాలువ ద్వారా 7,942 ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తున్నట్లు ప్రాజెక్టు డీఈఈ డి.రవికుమార్ తెలిపారు. కాలువ పరిధిలోని 8 బ్రాంచీలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నదిలోకి 1800 క్యూసెక్కుల నీరు రాగా, ఎడమ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాలువల ఆధునీకరణకు రూ. 193 కోట్లు మంజూరయ్యిందని, ఇంతరకు 22 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. కాలువల నిర్వహణను పరిశీలించేందుకు 30 మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యే జగదీశ్వరికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.మధుసూదనరావు, డి.వెంకటనాయుడు,డి.సత్యనారాయణ, కె.సుమన్, ఎ.తవిటినాయుడు, ఎం. సింహాచలంనాయుడు, విజయాంకుశం, ఏఈలు కె.రాజేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

కాలువల ఆధునీకరణ పనులు చేస్తున్నామంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు చేయకపోవడంతో సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వంగర మండలానికి చెందిన రైతులు డీఈఈ రవికుమార్‌ను ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత ఆరు సంవత్సరాలుగా సాగునీరు అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలువలలో పూడికలు, పిచ్చిమొక్కలు ఉంటే సాగునీరు ఎలా సరఫరా అవుతుందని ప్రశ్నించారు. పేరుకే కాలువలు, సాగునీరు వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. సాగునీటిపై ప్రశ్నిద్దామన్నా అధికారులు ఫోన్‌కు కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు సరఫరా చేస్తామని డీఈఈ రైతులకు భరోసానిచ్చారు.



కుడికాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు



డీఈఈ రవికుమార్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

రోడ్డు నిర్మించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దబ్బలగూడ నుంచి ఇజ్జకాయి గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇజ్జకాయి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురంలోని ఆమె నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని వారికి హామీ ఇచ్చారు.

మెలకువలు పాటించాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి వెదలు వేసుకున్న రైతులు సస్యరక్షణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని లుంబూరులో వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తున్న వరి పొలాలను శనివారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వెదలు జల్లిన మూడు రోజుల వ్యధిలో పెండిమిథాలిన్ లేదా ప్రిటిలా క్లోర్ 400 మి.లీల మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 4-8 రోజుల వ్యవధిలో సల్ఫ్యూరాన్ ఈథైల్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. 8-15 రోజులు వ్యవధిలో త్రైయమాఫోనే ఎథాక్సిసల్ఫ్యూరాన్ ఎకరానికి 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 18-25 రోజుల వ్యవధిలో బిస్పైరిబాక్ సోడియం 80-100 మిల్లీ లేదా బెంటేజోనే 800 మిల్లీలు, 25-30 రోజుల మధ్య ఫెనాక్సీప్రాప్‌పి ఈథైల్ 250 మిల్లీలు మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ 8గ్రాములు, 30-35 రోజుల మధ్య తుంగ, వెడల్పు ఆకు కలుపు ఉన్నట్ల అయితే 2,4 డీ అమైన్‌సాల్ట్ 4 వందల మిల్లీలు ఎకరానికి పిచికారీ చేయటం శ్రేయస్కరమన్నారు.

జీడి, మామిడి సాగుకు ప్రోత్సాహం

సీతంపేట: గిరిజనుల ముఖ్య ఆధాయవనరు జీడి, మామిడి. ఏటా హార్టీకల్చర్ మిషన్ ద్వారా ఈ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా సీతంపేట ఏజెన్సీలో జీడి, మామిడి సాగు విస్తీర్ణం పెంచందుకు ఉద్యానవనశాఖ ప్రణాళికలు రూపొందించింది. 20 ఎకరాల్లో జీడి, మరో 7.5 ఎకరాల్లో మామిడి వేసేందుకు అనుమతి వచ్చింది. ఎవరైతే రైతులు ముందుకు వస్తారో వారికి ఉచితంగా మొక్కలను సరఫరా చేయనున్నారు. మొక్కల పెంపకానికి ఎకరాకు రూ.12 వేలు చొప్పున మూడేళ్ల ఇవ్వనున్నారు. జీడి పునరుద్దరణ కార్యక్రమంలో 20 హెక్టార్లలో చేపట్టనున్నారు. రైతులు వేప నూనె, ఇతర మందులు వంటివి స్ప్రేయింగ్ చేసుకుని, కొమ్మకత్తిరింపు వంటి చేసుకుంటే ఎకరాకు రూ.10 వేలు చొప్పున ఇవ్వనున్నారు. ఈ విషయమై హార్టీకల్చర్ ఆఫీసర్ పేడాడ జయశ్రీ మాట్లాడుతూ.. రైతులు జీడి, మామిడి మొక్కలు నాటడానికి, పునరుద్దరణ పనులు చేపట్టడానికి ముందుకు రావాలని కోరారు.



జీడితోట

ఏకలవ్య పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

భామిని: స్థానిక ఏపీ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 6,7,8వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం హెచ్ఈపీ గ్రూపులో మిగులు సీట్లలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒ.గంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 10 సీట్లు, 7వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ హెచ్ఈపీ గ్రూపులో 14 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 18న ఉదయం 10 గంటలకు రెండో విడత కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు కొత్తూరులోని ఏకలవ్య పాఠశాలలో నిర్వహించే కన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఈఎంఆర్ఎస్‌లో ప్రవేశాల కోసం గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, సీట్లు రాని అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ఆధ్యాత్మిక ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు శనివారం ఆధ్యాత్మిక ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రామినాయుడు త్రైతసిద్ధాంత భగవద్గీతలోని అంశాలను భక్తులకు వివరించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పొంది ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయడమే త్రైతసిద్ధాంత భగవద్గీత ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, మద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

సీతంపేటలో కలెక్టర్ పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని ఐటీడీఏ సిబ్బంది తెలిపారు. ప్రజలు తమ సమస్య లను వినతుల రూపంలో నేరుగా కలెక్టర్‌కు తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలందించండి

సీతంపేట: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. వార్డులను పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వసతులు, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదని, వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేశారు. టైఫాయిడ్, మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్నందున గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు పెట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కషాయాలతో చీడపీడల నివారణ

సీతంపేట: వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంపలగూడ గ్రామంలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. బీజామృతం, ద్రవజీవామృతం, ఘనజీవామృతం తయారీ విధానం, వినియోగం, ఉపయోగాలను రిసోర్స్ పర్సన్లు పాలక నాగేశ్వరరావు, చిరంజీవులు వివరించారు. సీమాస్త్రం, పంచపత్ర కషాయం పిచికారీతో తెగుళ్లను సమర్థంతంగా నిర్మూలించవచ్చన్నారు. శ్రీవరి, వరి లైన్‌షోయింగ్, వరి జమున మోడల్ తయారీతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ వసంత, సీడీఎస్ లావణ్య, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

షాపుల వేలం ఖరారు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీకి చెందిన షాపులను అద్దెకు ఇచ్చేందుకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తుల సమక్షంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా పంచాయతీకి రూ.6.63 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రాము తెలిపారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మూడు షాపులను వేలంలో పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ షాపులకు త్వరలోనే మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు.



వేలంపాటలో పాల్గొన్న స్థానిక వ్యాపారులు

గురుకులంలో నీటి సమస్యపై విచారణ



విద్యార్థులను విచారిస్తున్న డీడీ, డిప్యూటీ ఈవో

సాక్షి ఎఫెక్ట్

సీతంపేట: మల్లి గురుకులంలో దాహం కేకలు శీర్షిక న శనివారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈమేరకు పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ గురుకులం ప్రిన్సిపాల్ వాసుదేవరావుతో నీటి సమస్యపై ఫోన్‌లో మాట్లాడారు. నీటి సౌకర్యం కల్పించడానికి కావాల్సిన ప్రతిపాదనలు పెట్టాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగధరావు, స్థానిక డిప్యూటీ ఈవో పి.నారాయుడు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిని నీటి సమస్యపై విచారించారు. తాగునీటికి సంబంధించి మినరల్ వాటర్ ప్లాంట్ ఉందని, అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా నిలిస్తే ఇబ్బందులు ఉన్నాయని గుర్తించారు. ఈఎంఆర్ఎస్, గురుకుల పాఠశాల, సీఓఈ కళాశాల విద్యార్థులు మొత్తం దాదాపు 850 మంది విద్యార్థులు ఉండడంతో స్నానాలకు, దుస్తులు ఉతకడానికి నీటి సమస్య ఉందని, పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

వీధి కుక్కలతో జర భద్రం

- శునకాల్లో విస్తరిస్తున్న డెర్మటైటిస్
- ఈ తరహా కుక్కలు కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం

పాలకొండ రూరల్: వీధుల్లో తిరుగాడే కుక్కల్లో చర్మ వ్యాధితో బాధపడుతున్న వాటిని మనం తరచూ చూస్తుంటాం. జుగుప్సాకరంగా ఉండే వాటిని చూసినా పట్టించుకోం. వీటితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఈ తరహా కుక్క కాటుకు గురైతే ప్రాణాంతక రేబిస్ వ్యాధిసోకే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

రేబిస్ సోకే ప్రమాదం

డెర్మటైటిస్ వ్యాధి సోకిన కుక్కల్లో చర్మంపై వెంట్రుకలు పూర్తిగా ఊడిపోతాయి. రక్తం, చీముతో కూడిన పొక్కులు ఏర్పడతాయి. చర్మం మందంగా మారుతుంది. ఇది అంటువ్యాధి. డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు, పశువులకు తగిలినా చర్మ సంబంధిత వ్యాధి సంక్రమిస్తుంది. మనుషుల్లో కూడా చర్మంపై ఉండే వెంట్రుకలు రాలిపోతాయి. మచ్చలు ఏర్పడి చర్మం మందంగా మారుతుంది. పశువులకు సోకితే వాటి బాహ్య చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి సోకిన కుక్క కరిస్తే రేబిస్ వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధి బారినపడిన జంతువులు చొంగ కార్చటం, డొక్కలు లోపలకు నొక్కుకుపోవడం, మేత సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు గమనించవచ్చు. వ్యాధి సోకిన ఏడు రోజుల్లో ఆ పశువు లేక జంతువు మరణిస్తుంది. మనుషుల్లో కూడా దాదాపుగా ఇదే లక్షణాలు కనిపిస్తాయి. రేబిస్ సోకిన పశువుల, కుక్కల చొంగ చేతికి తగిలితే చర్మ గ్రంథుల ద్వారా వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి

పెంపడు జీవాల ద్వారా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అవగాహన కలిగి ఉండాలి. వ్యాధుల నివారణకు కుక్కలకు, పశువులకు, ఇతర జీవాలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలి. ఇటీవల జునోసిస్ డేని పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ అధికారులు జంతు వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు పెంపుడు కుక్కలు, జంతువులకు టీకాలు వేశారు. టీకాలు వేయిస్తే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటాయి. వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించకపోవడంతో అవి కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం అధికంగా ఉంటుంది. ప్రస్తుత వర్షాకాలంలో శునకాలు సంతానోత్పత్తికి యత్నించే క్రమంలో వాటిలో వ్యాధులు విస్తరించే అవకాశం ఉంది. అలాగే కుక్క కాటుతో, ఇతర జంతువుల వల్ల మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



డెర్మటైటిస్ సోకిన శునకం

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రస్తుత సీజన్‌లో కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కేనాన్ మెంజు (డెర్మటైటిస్) వ్యాధిన బారినపడిన శునకాలతో ప్రమాదం. వీధి కుక్కల్లో పరన్నజీవుల కారణంగా వస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో కనిపించే ఈ తరహా కుక్కలకు దూరంగా ఉండాలి. ఇవి తిండి తినలేక, చొంగ కార్చుతుంటాయి. వీటికి రేబి స్ ఉండే అవకాశం అధికం. మా సిబ్బంది క్షేత్రస్థాయిలో వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు వీటి బారి పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఇటువంటి కుక్క కాటుకు గురైతే తక్షణమే వైద్య సేవలు పొందాలి.

– ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

ప్రభుత్వ సంస్థలు ఆస్తి పన్ను చెల్లించాలి

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయి ఉన్న ప్రభుత్వ సంస్థలు సత్వరమే ఆ బకాయిలను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే పన్ను బకాయిదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నా రు. ప్రధానంగా స్థానిక జిల్లా ఆస్పత్రికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయి పేరుకుపోయిందని ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా ఆస్పత్రికి సంబంధించి ఆస్తి పన్ను రూ.2,10,10,129లుగా ఉందని వడ్డీతో కలిపి మొత్తం రూ.4,36,85,809లు బకాయి ఉందన్నారు. అలాగే లేడీ డాక్టర్ క్వార్టర్స్‌కు సంబంధించి రూ.25,91,554లు, కుళాయి పన్ను కు సంబంధించి రూ.16 వేలు ఉందన్నారు. ఈ పన్ను బకాయిలకు సంబంధించి ఇప్పటికే పలుసార్లు ఆస్పత్రికి నోటీసులు అందజేసిన కనీస స్పందన లేదన్నారు.

ఆస్తి పన్ను బకాయి వాస్తవమే..

జిల్లా ఆస్పత్రికి సంబంధించి మున్సిపాలిటీకి ఆస్తి పన్ను బకాయి ఉన్నమాట వాస్తవమేనని డీసీహెచ్ఎస్ వాగ్దేవి అన్నారు. ఈ పన్ను చెల్లింపు విషయమై ప్రతి నెల జీతాలతో పాటు ఆస్తి పన్నుకు సంబంధించిన బిల్లులు పెట్టి ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరుగుతుందన్నారు. వారు నిధులు విడుదల చేయగానే ఆస్తి పన్ను చెల్లిస్తామని తెలిపారు.